ఉపవాస దీక్షలు..



ఆర్ఆర్‌నగర్‌లోని శివాలయంలో అభిషేకం చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



కబీర్‌నగర్‌లో..

హరహర మహాదేవ శంభో శంకర

- కూకట్‌పల్లి నియోజకవర్గంలో భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- శివ నామస్మరణతో మార్మోగిన ఆలయ పరిసరాలు

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం కూకట్‌పల్లి జోన్ పరిధిలోని దేవాలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజాము నుంచే శివయ్యకు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం భక్తుల రద్దీ పెరగడంతో శైవ క్షేత్రాలు కిటకిటలాడాయి. క్యూలైన్ల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు సైతం శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పూజల అనంతరం ఉపవాసం వదిలారు. రాత్రి లింగోద్భవం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

– కూకట్‌పల్లి



భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో శివయ్య దర్శనానికి వేచి ఉన్న భక్తులు

శివయ్యకు పూజలు



శివుడికి అభిషేకం చేస్తున్న భక్తురాలు











కూకట్‌పల్లిలో శివాలయంలో జరిగిన పూజలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



శివాలయంలో అభిషేకం చేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



పూజల్లో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్, నాయకులు



పాండురంగానగర్‌లోని శివాలయంలో పూజల్లో మూసాపేట కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్

నేడు నిమ్స్ ఓపీ సేవలకు సెలవు

లక్డీకాపూల్: మహాశివరాత్రి పర్వదినానికి సంబంధిత నిమ్స్ ఆస్పత్రికి శనివారం సెలవు ప్రకటించింది. దీంతో ఓపీ సేవలు ఉండవు. కేవలం ఎమర్జెన్సీ వైద్య సేవలు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఈ మేరకు నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతారామ్ ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి ప్రభుత్వం శుక్రవారమే సెలవు ప్రకటించినా ఆ రోజు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆస్పత్రిని తొలిసారిగా సందర్శించిన సందర్భాన్ని పురస్కరించుని ఆ సెలవును మరుసటి రోజుకు పొడిగించడం గమనార్హం.

మహిళలు దృఢంగా ఉండాలి

గచ్చిబౌలి: మహిళలు దృఢంగా ఉంటేనే సమాజం కూడా బాగుంటుందని సినీ నటి కుషిత కల్లపు పేర్కొన్నారు. కొండాపూర్‌లోని అపోలో క్రెడిల్‌లో 'స్ట్రాంగ్ ఉమెన్, స్ట్రాంగ్ భారత్' అనే అంశంపై శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కుటుంబం పట్ల ఎంత శ్రద్ధ వహిస్తారో తమ పట్ల కూడా వహించాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో బాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు చెకప్ చేయించుకొని వైద్యుల సలహాలను పాటించాలన్నారు. అపోలో క్రెడిల్ ప్రసూతి గైనకాలజిస్ట్ డాక్టర్ సుధామాధురి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండటం చాలా కీలకమన్నారు. అపోలో క్రెడిల్‌లో ప్రేమ అప్యాయతతో మహిళలకు సంరక్షణ అందిస్తున్నామన్నారు. గైనకాలజిస్టులు డాక్టర్ వంగళ్ళ పద్మిని శిల్ప, డాక్టర్లు శ్వేతా సికర్వార్, హరి కారెడ్డి, నందిని ప్రసంగించారు.

శివోహం పెయింటింగ్ పోటీలు ప్రారంభం

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో 3 రోజుల పాటు జరగనున్న శివోహం పెయింటింగ్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మనోహర్ మాట్లాడుతూ మనలో ఉన్న భక్తిని అనేక రకాలుగా చూపవచ్చని ,చిత్రకారులు పెయింటింగ్ రూపంలో చూపుతారన్నారు. వారి కళను వెలుగులోకి తెచ్చే క్రమంలో ప్రతి సంవత్సరం ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజు 32మంది కళాకారులు పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఆదివారం చివరి రోజు ఉత్తమ పెయింటింగ్‌లకు బహుమతులను ప్రదానం చేస్తామన్నారు.

సమాజంలో వివక్షతపై మహిళలు పోరాడాలి

హిమాయత్‌నగర్: సమాజంలో మహిళలపై రోజురోజుకూ వివక్ష పెరుగుతున్నదని, ఆ వివక్షతను రూపుమాపేందుకు మహిళలు పోరాడాల్సిన అవసరం ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళ జేఏసీ చైర్‌పర్సన్ మట్ట జయింతి గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మహిళలు అన్ని రంగంలో రాణించాలని ఆకాంక్షిస్తున్నాన్నారు. నేడు మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పోటీ పడుతూ అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఎక్కడో ఒక చోట మహిళలకు వివక్ష మాత్రం ఎదురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిని గౌరవించే వారే, స్త్రీలను గౌరవిస్తారన్నారు. దేశంలో మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ మహిళలపై అత్యాచారాలు, దారుణాలు చోటుచేసుకోవడం బాధాకారమన్నారు. కేవలం ఒక్క రోజుకే మహిళా దినోత్సవం పరిమితం కాకూడదని, మహిళలు అన్ని విధాలుగా అండగా ఉంటూ వారికి పూర్తి రక్షణ కల్పించినపుడే నిజమైన మహిళా దినోత్సవం అవుతుందన్నారు.

నిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

లక్డీకాపూల్: నిమ్స్‌లో దశాబ్దాల తరబడి సేవలందిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులు కోరారు. శుక్రవారం ఆస్పత్రిని సందర్శించిన మంత్రికి నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. 306 డ్రాఫ్ట్ జీవోను గెజిట్ చేసిన తమ వేతనాలు పెంచడమే కాకుండా ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. సీనియార్టీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్న వేతనాన్ని కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు.

వైభవంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

అయోధ్య రామయ్య పాదుకల శిల్పి ఆధ్వర్యంలో నిర్వహణ



భవానీనగర్‌లో స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు, పిట్లంపల్లి రామలింగాచారి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మ కల్యాణం మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు, అయోధ్య రాముడి పాదుకల శిల్పి పిట్లంపల్లి రామలింగాచారి ఆధ్వర్యంలో కల్యాణం వైభవంగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామలింగాచారి మాట్లాడుతూ ప్రతి ఏడాది శివరాత్రి పర్వదినాన వీరబ్రహేంద్రస్వామి గోవిందమ్మ కల్యాణం నిర్వహించడం



అనవాయితీగా వస్తోందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఆలయ నిర్వాహకులు కళిదాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: గాయత్రినగర్ ఉమెన్స్ పార్కులో ఈనెల 10వ తేదీన పార్థివ్ లంగ్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ నాగరాజు తెలిపారు. ఈ శిబిరంలో టీబీ, ఆస్తమా, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా చికిత్సతో పాటు మందులను పంపిణీ చేస్తామన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

మోతీనగర్: మోతీనగర్‌లోని షైనింగ్ సీడ్‌స్కూల్ ఏడో వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథులుగా శ్రీసాయిరాం, శ్రీనిధి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డా. నల్లపాటి వెంకటేశ్వరరావు, ఈ అభ్యాస్ అకాడమీ ఫౌండర్ డా. ఫణి పవన్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, షైనింగ్ సీడ్స్ పాఠశాల చైర్మన్ ఎస్‌కె. కుషిద్ ఆలీ, కరస్పాండెంట్ షాహిజాన్, ప్రిన్సిపాల్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ టీ–చాంపియన్‌షిప్– 2024



తెలంగాణ టీ ఛాంపియన్‌షిప్ 2024 విజేతలు

మాదాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హెచ్ఐసీసీలో తెలంగాణ టీ చాంపియన్‌షిప్– 2024ను నిర్వహించారు. మహిళలు టీని తయారీలో తమ ప్రతిభను చాటారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ లో గురువారం రాత్రి హైబీజ్ టీవి పోటీల్లో మహిళలు పెట్టిన ఛాయ్‌ని జ్యూరీ సభ్యులు రుచి చూశారు. అత్యధిక పాయింట్లు సాధించిన 12 మందిని విజేతలుగా నిర్ణయించారు. మొదటి బహుమతి కె.జ్యోత్స్న లక్షరూపాయలు, రెండవ బహుమతి వరలక్ష్మి రూ.50వేల రూపాయలు, మూడవ బహు మతి పి.జ్యోత్స్నకి రూ. 25వేలు, ఇద్దరికి రూ.10వేల చొప్పున ఐదుగురు విజేతలకు నగదును, బహుమతులను అందజేశారు. నటి సుమయారెడ్డి, శ్రీ చక్ర మిల్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.బ్రహ్మయ్య, నేషనల్ జనరల్ సెక్రటరీ డ్రైడాయ్ జి.రాంరెడ్డి, హైబీజ్ టీవి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రాజ్‌గోపాల్, సీఈఓ జె.సంధ్యారాణిలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ జాగృతియాత్ర



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌యూఐ హెచ్‌సీయూ జాగృతి యాత్రను ఎన్ఎస్‌యూఐ కోఆర్డినేషన్ సభ్యుడు పట్లోళ్ళ శ్రీరామ్ యాదవ్ జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ విద్యార్థుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి విద్యార్థులతో కలిసి ఉద్యమిస్తామ న్నారు. కనీస సౌకర్యాల కల్పన, నాణ్యమైన భోజనం, ఫెలోషిప్స్, ఫెసిలిటీస్‌ని అందిస్తూ ఫీజులను తగ్గించే విధంగా ఈ యాత్ర జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు ప్రబాకర్‌సింగ్, నేహ జయరాజ్, శ్రీరామ్‌యాదవ్, ప్రణతి, దారం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మోతీనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మోతీనగర్‌లోని అవంతినగర్ మహిళా మండలి సభ్యులు క్రీడా పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీహెచ్. సత్యనారాయణ, నాయకులు అంబటి శ్రీనివాస్, సత్యం, వెంకటేశ్వరరావు, తిరుపతి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి అలేఖ్య సంఘం సేవ సంస్థ ఆధ్వర్యంలో..



వివిధ వృత్తుల్లో రాణిస్తున్న మహిళలకు చీరలను అందజేస్తున్న అరుణ అశోక్

అల్విన్‌కాలనీ: శ్రీసాయి అలేఖ్య సంఘం సేవ సంస్థ నిర్వాహకురాలు అరుణ అశోక్ వివిధ వృత్తుల్లో రాణిస్తున్న మహిళలను గుర్తించి శుక్రవారం వారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సృష్టికి మూలం మహిళలను గౌరవించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మన అవసరాలను తీర్చే వారిని చిన్నచూపు చూడటం భావ్యం కాదన్నారు.

స్నేహ మోడల్ స్కూల్‌లో..

భాగ్యనగర్‌కాలనీ: మహిళా దినోత్సవాన్ని ఇంద్రాహిల్స్ కాలనీలోని స్నేహ మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, ఆయన సతీమణి సౌజన్యతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పారిశుద్ధ్య కార్మికులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్నేహ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మమతరాజ్, కరస్పాండెంట్ ఎం. రాజు, ఉపాధ్యాయురాళ్లు శారద, వనజ, రేణుక, సోనీ, సౌజన్య, సాయి ప్రియ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



స్నేహ మోడల్ స్కూల్‌లో..

మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి

రాజకీయ శాస్త్రవేత్త ప్రొ.జోయాహసన్

రాయదుర్గం: మహిళా సాధికారత లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదని ప్రముఖ రాజకీయ శాస్త్రవేత్త జేఎన్‌యూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్స్ మాజీ డీన్ ప్రొఫెసర్ జోయాహసన్ పేర్కొన్నారు.శుక్రవారం గచ్చిబౌలిలోని మనూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆరవ అంతర్జాతీయ ఉర్దూ సోషల్‌సైన్స్ కాంగ్రెస్‌లో భాగంగా ప్రత్యేక సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా 'కౌంట్ హర్ ఇన్: జెండర్ ఈక్వాలిటీ త్రూ ఎంపవర్‌మెంట్' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. మహిళలను ప్రోత్సహిస్తే తమ సత్తా చాటుతారని అన్నారు. ఏఎంయూ డైరెక్టర్ ట్రిబాక్ న్యూఢిల్లీ మాజీ ప్రొఫెసర్ అబ్దుల్ మతిన్ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం ద్వారా మహిళా సాధికారత జరుగుతుందన్నారు. హెచ్‌సీయూ సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్, హిస్టరీ విభాగం ప్రొఫెసర్ రేఖా పాండే మాట్లాడారు. కార్యక్రమంలో జేఎన్‌యూ ఎకనామిక్స్ ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, మనూ ఓఎస్‌డీ–1 ప్రొఫెసర్ షుగుప్తా షాహీన్, మనూ ఎకనామిక్స్ గౌరవ ప్రొఫెసర్ అమితామ్ కుందు, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు ప్రొ.అమీరుల్లాఖాన్, మాజీ వీసీ ప్రొ. రహమతుల్లా, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ, కో కన్వీనర్ డాక్టర్ సయ్యద్ నజీవుల్లా, ముస్తాజాబ్ ఖతీర్ ప్రసంగించారు.



ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

మహిళలకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ముఖ్యం

ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ రేఖారాణి

బంజారాహిల్స్: ఒకప్పటితో పోలిస్తే ప్రస్తుతం మహిళలను కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహిస్తున్నారని ఇది మహిళలు మరిన్ని విజయాలు సాధించేందుకు దోహదపడుతుందని ఐఏఎస్ అధికారిణి, ఏపీ ప్రిన్సిపల్ సెక్రటరీ రేఖారాణి అన్నారు. బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీలో వివిధ విభాగాల మహిళా అధ్యాపకుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఒకప్పుడు చేసే ప్రతి పనిలో మగా, ఆడ తేడా చూసేవారని కానీ ఇప్పుడు అవేవి అడ్డురావడం లేదన్నారు. అన్ని రంగాల్లో మహిళలు పోటీ పడి రాణిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రతి మహిళా తమ తమ శక్తి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సైబర్ మోసం

రూ.7 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట ఓ వ్యక్తి రూ.7 లక్షలు పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్‌పూర్ సీఐ నాగరాజు కథనం ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని పిజెఆర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జనవరి 1వ తేదీన ట్రేడింగ్‌కు సంబంధించి మెసేజ్ వచ్చింది. దీంతో ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు అకౌంట్ కోసం తన వివరాలను యాప్‌లో నమోదు చేశాడు. ఓ ఐడిని క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఆ ఉద్యోగి నగదును ఆన్‌లైన్ ఇన్వెస్ట్ చేశాడు.పెట్టిన నగదుతో పాటు, లాభాలు చూపిస్తూ వచ్చాడు .అయితే బాధితుడు పలు దఫాలుగా రూ.7 లక్షలు ఇన్వెస్ట్ చేసి, తాను పెట్టిన నగదుతో పాటు లాభాలు ఇవ్వమని అడగగా అపరిచిత వ్యక్తులు స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం శుక్రవారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువతి వద్ద నుంచి..

ఆధార్ కార్డు ఇల్లీగల్ అకౌంట్లకు లింక్ ఉందని చెప్పి బెదిరించి సైబర్ నేరగాళ్లు ఓ యువతి వద్ద నుండి రూ. ఒక లక్ష నలభైఎనిమిది వేలు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...అమీన్‌పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ యువతికి ఫిబ్రవరి 14వన ఫోన్ కాల్ వచ్చింది. ముంబై పోలీసులమని, నీ ఆధార్ కార్డు ఇల్లీగల్ బ్యాంక్ అకౌంట్లకు లింక్ ఉందని, నీ పైన కేసు నమోదైందని బెదిరించి ఆ యువతి వద్ద నుండి ఒక లక్ష 48 వేలు కాజేశారు.దీంతో బాధితురాలు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.